సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

స్మార్ట్ మీటర్లు వద్దని ధర్నా

సింధియా: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే యోచనను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మల్కాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. సర్దుబాటు చార్జీలను వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్కాపురం జోన్ కమిటీ నాయకులు కె.పెంటారావు, పిసిని రామారావు, బాబూరావు, ఎల్.కృష్ణ, సత్యారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం నియామకం

అల్లిపురం: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విశాఖ జిల్లా నూతన కమిటీ నియామకాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా 11వ మహాసభల్లో భాగంగా అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన రెండో రోజు కార్యక్రమంలో ఏడుగురు జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు 17మంది జిల్లా కౌన్సిల్ సభ్యులు నియమితులయ్యారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కె.అచ్యుతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.రాంబాబు, ఉపాధ్యక్షుడిగా యు.రాగరాజు, రమణ, సహాయ కార్యదర్శులుగా ఎస్.మధురెడ్డి, కోమర సందీప్, కోశాధికారిగా శివలను నియమించినట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళీ సుబ్బారావు తెలిపారు.

అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023 – 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నామని యూనివర్సిటీ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్. ఎల్.విజయకృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫీజు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ ప్రొగ్రామ్స్‌లో అడ్మిషన్ల కోసం www. braouonline. in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సినీ ఆర్టిస్ట్‌లకు హెల్త్‌కార్డుల పంపిణీ



సభ్యులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సభ్యులకు హెల్త్‌కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని పలువురు సభ్యులకు హెల్త్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖకు ఫిల్మ్ ఇండస్ట్రీ తరలిరావాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, మురళీ, వర్మ, సురేష్, జేటీ రామారావు, వాసు, రమేష్ పాల్గొన్నారు.

ఇండియన్ ఐడల్ విజేత సౌజన్యకు సన్మానం రేపు

ఏయూ క్యాంపస్: ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవాల్లో భాగంగా ఇండియన్ ఐడల్ సీజన్–2 విజేత గాయని భాగవతుల సౌజన్యని బుధవారం సన్మానించనున్నామని అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ సత్కార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన ‘ఆణిముత్యాలు’

పది టాపర్లను సత్కరించిన నాయకులు, ఉపాధ్యాయులు



జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు అందుకున్నవారితో బెహరా భాస్కరరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలతో సర్కారు బడుల రూపురేఖలు మారాయి. నాడు–నేడు ద్వారా ఓ వైపు మౌలిక వసతులు కల్పించడంతో పాటు.. బోధనలో నూతన పద్ధతులు అవలంబించడంతో ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిశారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించారు. పదిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం చేపట్టారు. దానిలో భాగంగా సోమవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు ప్రదానం చేశారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయన్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేస్తూ డిజిటలైజేషన్ చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన వారికి ఆణిముత్యాలు అన్న కార్యక్రమం ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తున్నారని చెప్పారు.

- జిల్లా పరిషత్ ఉన్నత్ పాఠశాలలో 585 మార్కు లు సాధించిన రాయబోని శ్రీనివాస్‌కు రూ.3000, 577 మార్కులు సాధించిన అనకాపల్లి విశ్వనాథ్‌కు రూ.2000, 569 మార్కులు సాధించిన గొర్లి హరికృష్ణకు రూ.1000నగదు, ప్రశంసా పత్రాలు అందించారు.
- బాలికల పాఠశాలలో 584 మార్కులు సాధించిన రాయవరపు లక్ష్మీ సత్య సాయి గౌతమి, గవర జాహ్నవిలకు రూ.3000 చొప్పున, 570 మార్కులు సాధించిన ఇ. ధనశ్రీకి రూ.2000, 544 మార్కులు సాధించిన దాక్షాయిణికి రూ.1000 నగదు బహుమతి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, బాలికల పాఠశాల హెచ్ఎం ఎస్తేర్ ఎప్సిబా, 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు గొంతిన నాగరాజు, బల్లంకి ప్రేమ్ కుమార్, జి. నాగరాజు, జి. జగదీష్, షేక్ వల్లి, బాబూరావు మాస్టారు పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధిస్తా



ఐఐటీలో ఫ్రీ సీటు సాధించి ఉన్నత స్థాయికి వెళ్తాను.అందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికగా బద్ధంగా కృషి చేస్తున్నాను. నాన్నగారు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను.

– సాయి గౌతమి, బాలికల పాఠశాల

ఇంజినీరింగ్ చేస్తాను



ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన వారికి ట్రిపుల్‌ఐటీలో ఉచిత సీటు వస్తుంది. దాని ద్వారా ఇంజినీర్ అవుతాను. తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటాను. కుటుంబానికి ఆసరాగా నిలుస్తాను.

– జాహ్నవి, బాలికల పాఠశాల

నా లక్ష్యం కంప్యూటర్ ఇంజనీర్



ఐఐటీలో సీటు సాధించి కంప్యూటర్ ఇంజనీర్ కావాలన్నదే నా లక్ష్యం. మా ఉపాధ్యాయుల సలహాలు తర్ఫీదు నాకు ఇన్ని మార్కులు వచ్చేలా చేశాయి. వారికి ఎప్పుడూ కృతజ్ఞుడినై ఉంటాను.

– రాయబోని శ్రీనివాస్, బాలుర పాఠశాల

ఈసీఈలో ఇంజనీరింగ్ చేస్తా..



పదిలో మంచి మార్కులు రావడానికి మా ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ ఎంతో దోహదపడింది. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ చేస్తాను. ప్రస్తుతం ఇంటర్‌లో చేరాను. ఐఐటీలో సీటు సాధించి ఇంజనీరింగ్ చేస్తాను.

– అనకాపల్లి విశ్వనాథ్, బాలుర పాఠశాల

52వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: మహావిశాఖ నగరం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డులో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 15వ వార్షిక ప్రణాళిక నిధులు రూ.1.60 కోట్లతో జిందాల్ భవనం నుంచి మర్రిపాలెం వుడా లేఅవుట్ మీదుగా ఆర్అండ్‌బీ జంక్షన్ వరకు 80 అడుగుల డబుల్ రోడ్డును అభివృద్ధి చేయనున్నామన్నారు. మోడల్ లైటింగ్, సెంటర్ డివైడర్, గ్రీనరీ కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వార్డులో ఇంకా పలు పనులు జరుగుతున్నాయన్నారు. 52వ వార్డును మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రధానంగా రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పార్కులు, మురుగు కాలువల ఆధునికీకరణకు పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈలు ఈశ్వర్ గుప్తా, శివ, వైఎస్సార్ సీపీ నాయకులు వెదుళ్ల శ్రీనివాసరావు, జియ్యాని మారుతి, జియ్యాని విజయ్, కంచిపాటి వెంకటరమణ, అంబటి నాగరాజు, సిహెచ్.వి.సురేష్, గురుమూర్తి, శంకర్, సూర్య నారాయణ, నారాయణమ్మ, దేవి, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

జోన్–5 ఏసీపీగా రఘునాథ్



విధుల్లోరఘునాథ్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా రఘునాథ్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఉత్తర్వుల మేరకు బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథ్‌ను జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అభినందించారు. ఏసీపీ రఘునాథ్ మాట్లాడుతూ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై దృష్టి సారించాలని టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. ఇళ్లు నిర్మించే వారు జీవీఎంసీ ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని, జోన్ ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మోదకొండమ్మ తొలేళ్లు



అమ్మవారి సారెను ఊరేగిస్తున్న మహిళలు

గోపాలపట్నం: గోపాలపట్నం దరి ఇందిరానగర్‌లోని మోదకొండమ్మ అమ్మవారి తొలేళ్లను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి సారె, ప్రతిమల ఊరేగింపు నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రతిమలు, సారె తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఇందిరానగర్‌లోని పలు వీధుల్లో మహిళలు సారె ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రధాన పండగ

మంగళవారం ప్రధాన పండగ నిర్వహించనున్నారు. ఉదయం నుంచి అధి సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణం, ఇందిరానగర్ ప్రాంతాల్లో విద్యుత్ అలంకరణలో ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి.



అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

సైకిల్‌పై జీవీఎంసీకి కమిషనర్



సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణకై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం తిరిగి సైకిల్‌పైనే బంగ్లాకు వెళ్లారు. కాలుష్య నియంత్రణకు కనీసం వారానికి ఒక రోజైనా నగర ప్రజలు తమ సొంత వాహనాలు వదిలి, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని కమిషనర్ కోరారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న నగర మేయర్



తిరుమల శ్రీవారి సన్నిధిలో మేయర్

డాబాగార్డెన్స్: విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి దయతో జగనన్న ప్రభుత్వం ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, వెంకన్న స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్టు ఆమె చెప్పారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జోన్–5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురం జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. రెవెన్యూకు 01, ఇంజినీరింగ్‌కు 02, యూసీడీ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్. రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ కె.శైలజ, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్కూల్ బస్సుల తనిఖీలు



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: స్కూల్ బస్సుల తనిఖీలు కొనసాగుతున్నాయి. నగరంలో ఎన్ఏడీ జంక్షన్, మద్దిలపాలెం, బోయపాలెం, గాజువాక, షీలానగర్, బీచ్ రోడ్డు, చావుల మదుం జంక్షన్ ప్రాంతాల్లో రవాణా శాఖ అధికారులు సోమవారం ఈ తనిఖీలు చేట్టారు. ఈ నెల 30 వరకు ఈ తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. సోమవారం తనిఖీ చేసిన స్కూల్ బస్సులన్నింటికీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు ఆర్.సుధీర్, బాలాజీరావు, శ్రీనివాసయాదవ్, పి.శిరీష, సత్యంనాయుడు శిరీషా దేవి, సృజన తనిఖీల్లో పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

ఫ్యూజ్ బాక్స్‌కు తలుపులు అమర్చరూ!



గాంధీజీవీధి వద్ద ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ బాక్స్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గాంధీజీవీధిలోని 213 నెంబర్ గల ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా ఉంది. తలుపులు లేవు. చిన్నారులు ,విద్యుత్ సరఫరాపై అవగాహన లేని వారు ఈ ఫ్యూజ్ బాక్స్ వద్దకు వెళ్తే షాక్‌కు గురికాకతప్పదు.అధికారులు సమస్యపై స్పందించాలి.

– సర్వసిద్ధి పైడిబాబు, గాంధీజీవీధి

మార్కెట్ స్థలం గ్రామాభ్యుదయ సంఘానిదే..

ఆర్డీవో కోర్టు తీర్పు ఇచ్చిందని వెల్లడించిన నాయకులు



కోర్టు తీర్పు పత్రాలు చూపిస్తున్న సంఘ నాయకులు, సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం మెట్టు ప్రాంతంలో గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం నిర్మించిన భవనంతో పాటు మార్కెట్ నిర్వహిస్తున్న స్థలం గ్రామాభ్యుదయ సంఘానికే చెందుతుందని ఆర్డీవో కోర్టు తీర్పు ఇచ్చిందని ఆ సంఘం అధ్యక్షుడు భీశెట్టి వెంకటరావు పేర్కొన్నారు. గవర కంచరపాలెం గ్రంథాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాభ్యుదయ సంఘానికి చెందిన మార్కెట్‌ను రోజువారి వ్యాపారాలు చేసుకునే వర్తకులు ఆ స్థలంపై సంఘానికి వ్యతిరేకంగా ఆర్డీవో కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేసి నివేదికను కోర్టుకు సమర్పించారన్నారు. తమ వద్ద ఉన్న హక్కు పత్రాలను కోర్టుకు సమర్పించడంతో సదరు ఆర్డీవో కోర్టు గవర కంచరపాలెంలో నిర్మించిన భవనం, మార్కెట్ స్థలం ప్రభుత్వ స్థలం కాదని పూర్తిగా సంఘానికి చెందినదని ఇటీవలే తీర్పు ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఆర్డీవో కోర్టు తీర్పు స్వార్థపరులకు కనువిప్పు కలిగిస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ నుంచి రోజువారి మార్కెట్ చేసుకునే వారిని ఖాళీ చేయించే ఉద్దేశం తమకు లేదన్నారు. మార్కెట్ స్థలం ప్రభుత్వ భూమి కాదని పూర్తి హక్కులు గ్రామాభ్యుదయ సంఘానిదే అని ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రహించాలని ఆయన కోరారు. వ్యాపారులు ఇప్పటివరకు చెల్లించాల్సిన అద్దె బకాయిలు పూర్తిగా చెల్లించి అదే స్థలంలో వ్యాపారాలు చేసుకునేందుకు తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు పీకేవీ రమణ, కార్యదర్శి భీశెట్టి వీరబాబు, కోశాధికారి మళ్ల రామకృష్ణ, తనిఖీదారు కాళ్ల రామారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ కొణతాల నర్సింగరావు, మాజీ అధ్యక్షుడు మళ్ల శంకరావు, మళ్ల బలరామ్, గోవింద్‌గణేష్, వెంకట అప్పారావు, పీఆర్‌వో మళ్ల మోహన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతిపై అవగాహన అవసరం



అలేఖ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రేమకుమారి



వేదికపై వివిధ సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

మల్కాపురం: దేశ సంస్కృతి,సంప్రదాయాల పట్ల ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి అన్నారు. అసోం రాష్ట్రంలోని కంజరంగా యూనివర్సిటీలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థి వి.అలేఖ్య పాల్గొని ప్రతిభ చూపింది. ఈ మేరకు సోమవారం కళాశాలలో అలేఖ్యను అభినందించారు. ఈ సందర్భంగా ప్రేమకుమారి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వమే భారత దేశ విశిష్ట లక్షణమని వివరించారు.మన దేశ సంప్రదాయాలను విదేశీయులు సైతం గౌరవిస్తారన్నారు. అంత గొప్ప చరిత్ర గల మన సంప్రదాయాలను ప్రస్తుత తరం విస్మరిస్తుందన్నారు. జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జాతీయ సమైక్యత శిబిరంలో రాష్ట్రం నుంచి ఐదుగురు అమ్మాలు,ఐదుగురు అబ్బాయిలు పాల్గొన్నారని..అందులో తమ కళాశాలకు చెందిన అలేఖ్య ఉండడం సంతోషంగా ఉందన్నారు.అభినందన కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలు,వస్త్రాలతో చేసిన ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుతోనే గుర్తింపు



పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: ఎంతటి ఇబ్బందులు వచ్చినా చదువును నిర్లక్ష్యం చేయరాదని జీవీఎంసీ 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య అన్నారు.వార్డు పరిధి శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారన్నారు. విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. వాటి ఫలితమే ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జీవీఎంసీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించడం అన్నారు. ప్రతి విద్యార్థికి అన్న మాదిరిగా జగనన్న తోడుగా ఉంటారని, ఎంతటి ఉన్నత విద్య అయినా పైసా ఖర్చు లేకుండా అందిస్తారని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆమె నగదు అందించి, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.ఎల్.లక్ష్మణ్, ఉపాధ్యాయులు ప్రకాష్,నాయకులు జి.కృష్ణ, గొందేశి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



సన్మాన గ్రహీతలతో కార్పొరేటర్ నాగేశ్వరరావు, బ్రహ్మకుమారీలు

సింధియా: కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన పలు విభాగాలకు చెందిన వారిని సోమవారం శ్రీహరిపురం బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు సేవలందించిన శానిటరీ, సచివాలయ, వైద్య విభాగాలకు చెందిన పలువురిని మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయం ప్రజలకు ఒక పీడ కలగా మిగిలిపోతుందన్నారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రాణాలు తెగించి సేవలందించిన ప్రభుత్వ సిబ్బందిని ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. శ్రీహరిపుర బ్రహ్మకుమారీస్ సంస్థ అటువంటి సేవలను గుర్తించి సత్కరించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ శ్రీహరిపురం బ్రాంచ్ సిస్టర్స్ సింధు, అనురాధ, బ్రదర్ చినఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆందోళన

కంచరపాలెం: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు యోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం కంచరపాలెం జోన్–2 ఈపీడీసీఎల్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఈఈ బీకే నాయుడుకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బి.పద్మ మాట్లాడుతూ బిల్లులపై అదనపు చార్జీలు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో జోన్ నాయకులు సోమేశ్వరరావు, ఈశ్వరరావు, అప్పారావు, వెంకటరావు, పుష్ప, కల్యాణి, శారద, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
✆ 9398184202, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
✆ 9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com